# గుఱ్ఱపు కళ్లెం

ఒక చంటిబిడ్డ చేసిన సాధారణమైన ఏడుపు విని, ఆ శనివారం ఉదయం ఐదున్నర గంటలకు, కోటయ్య అసాధారణమైన రీతిలో నిద్ర లేచాడు. పసిపాప యొక్క మామూలు ఏడుపంటే, పిల్లల్ని ప్రసవించిన ప్రతి స్త్రీకి, తను తండ్రి అయ్యాడని అనుకున్న ప్రతి ఒక మగవాడికి, తెలియకుండా వుండడానికి వీలులేదు. చిన్న పిల్లలు, చిన్న ఆకలి వుంటే ఏడుస్తారు -- ఆ చిన్ని కడుపులో, ఏదైనా గొడవగాని, సమ్మెగాని సంభవిస్తే మళ్లీ ఏడుపే -- మూత్రం పోస్తున్నప్పుడు దాని వేడిలోగాని, తర్వాత వచ్చిన చల్లదనానికి కూడా ఏడుపే -- దూరదర్శన్ వార్తాప్రసారాల చివర చూపించే ఉష్ణోగ్రత వివరాలు చదవకున్నా, వినకున్నా, తమ స్వానుభవాన్ని మాత్రం ఆధారం చేసుకొని, చెవులు బద్దలయ్యేటట్టు చిన్నపిల్లలు ఏడుస్తారు. ఒక చీమగాని, దోమగాని కుట్టినా ఏడుస్తారు. చీకటి చూసి భయపడ్డానికి వయసు లేకున్నా, భయం కలిగినట్టు ఏడుస్తారు -- ఏడ్వడానికి ఏకారణం లేకపోయినా ఏడ్వడానికి మాత్రమే ఏడుస్తారు. అవసరం వున్నా లేకపోయినా ఏడ్వడంలో ఏం తప్పులేదని పిల్లలకు తెలుసేమో! కాని, అకారణంగా నవ్వుతూ వుండడం, బుద్ధి మాంద్యం, బుద్ధి భ్రమణం లక్షణాలని, శైశవ, బాల్య, కౌమార, యౌవనమనే మెట్లు ఎక్కిన, వృద్ధులకు కూడా బాగా తెలిసి వున్నప్పుడు, దైవ సమానులైన శిశువులకు ఆ విషయం తెలియకుండా వుంటుందా? ఏమో మరి? అది దేవుడికే తెలుసు.

అయితే కోటయ్య అసాధారణమైన రీతిలో లేచాడు అంటే ఏమిటని అర్థం? ఒక చంటి బిడ్డ ఏడుపు వినడంవల్ల వులిక్కిపడి లేచాడని మాత్రమే దాని అర్థం. ఆ పసిపిల్ల ఏడుపుకు, వేంకటేశ్వర సుప్రభాతానికి దగ్గర బంధుత్వం లేకపోవడం వలననే అతడు వులిక్కిపడి లేచాడు? కాదు నిద్రపోకూడని సమయంలో నిద్రపోతుంటే ఏవైనా శబ్దం యాదృచ్ఛికంగా చెవిలో దాడి చేస్తే, లేవడంతోపాటు ఒక వులికిపాటు రావడానికి ఆస్కారముంది. అంటే ఈ సమయంలో -- ఇక్కడ --

తెల్లవారు ఝామున ఎవరు కూడా సెంట్రీ డ్యూటీ చేయడానికి ఇష్టపడరు. కోటయ్యకయితే అది కొద్దిగా కూడా నచ్చని కార్యక్రమం. కాని ఏం చేయాలి ''పాపీ పేట్ కా సవాల్'' కదా! పొట్ట కొరకు అయిష్టకరమైన కార్యాలు ఎన్నో చేయాల్సి వస్తుంది.

ఈ పోలీసు డిపార్ట్‌మెంట్‌లో అయితే నచ్చిన కార్యక్రమాలు చేయడానికి అవసరాలు తక్కువ - అయిష్టమైనవి పెద్ద మోతాదులో వినడం, చూడడం, చెయ్యడం, చేయించడం అన్నీ మామూలే అని బాగా తెలుసుకొనే కోటయ్య ఉద్యోగంలో ప్రవేశించాడు. ఏదో పదోతరగతి పాసయ్యేడు, ఐదున్నర అడుగులు ఎత్తు పొట్లకాయలా పెరిగాడని చెప్పి ఎవరైనా ఉద్యోగం ఇస్తారా? ఆ పని దొరికే వరకు, అతని గుండెదడ, అతణ్ణి నిద్రపోనివ్వలేదు. కాని ఇప్పుడు గమనించరు -- అతని డిసిప్లెన్ ఎంతవరకు క్షీణించిపోయిందో! ఉద్యోగం వూడిపోతుందనే కనీస భయమన్నా లేక - అతను యిలా ప్రవర్తిస్తున్నాడు. వేకువ ఝామున సెంట్రీ డ్యూటీ బాధ్యతలు తీసుకొని, పోలీసు స్టేషన్ బయట కాపలా కాయకుండా, తన తుపాకిని గోడకానుకొని నిద్రపోయేటట్టు చేసి, తన ఆసనం ఒక కుర్చీపై వుంచి, రెండు కాళ్లను వేరొక కుర్చీపై నిక్షేపించి, గురకలు కొడుతూ నిద్రపోయాడు కోటయ్య. ఆ కుర్చీలు ఎవరివి అనే అనవసర ప్రశ్నను, నిద్రపోకుండా వుండడం వీలుకాని అతనికి ఇబ్బంది కలిగిస్తుందని చెప్పి, దాన్ని వదిలేద్దాం. గార్డు డ్యూటీలో వున్న మిగతా ముగ్గురు కానిస్టేబుల్స్, దోమల్ని ఛాలెంజ్ చేస్తున్నట్టు బండరాళ్లలాగా నిద్రపోతున్నారు. వాళ్ల ఛాలెంజుల ధోరణికి, నాదం, తాళం - నాసా రంధ్రాలు, వక్త్రాలు యథాశక్తి సృష్టిస్తున్నాయి.

ఆ విధంగా సర్వం శాంతిమయంగా వున్న ఆ పోలీస్ స్టేషన్ వరండాలో ఆ ఉదయం, ఏదో ఒక విశ్వామిత్రుడు అతి క్రూరంగా తిరస్కరించిన మరియొక మేనక, ఈ అభినవ శకుంతలను ఉపేక్షించి వెళ్లిపోయింది. ఆ పాప కొంచెం సేపు ఏడ్వకుండా వుండడానికి ఆ పసికందు నోట్లో ఒక రబ్బర్ నిప్పిల్ పెట్టి, కొన్ని రోజులు ముందువరకు గర్భవతిగా వున్నా -- ప్రస్తుతం బుద్ధిమతిగా వున్న, ఆ తరుణి అక్కడనుండి అంతర్ధానమయ్యింది. ఆ చిన్ని నోట్లోంచి, ఆ పెద్ద నిప్పిల్ క్రింద పడిపోయింతర్వాత ఆ చిన్న పాపే ఒక సైరన్ మోగించి, కోటయ్యను నిద్రలేపింది. ఏడుస్తున్న శిశువును చూసిన కోటయ్యకు తన కళ్లను నమ్మాలా? వద్దా? అన్న సందేహం కలిగింది. మామూలు రోజుల్లో తెల్లారిందని తెలిస్తే లేవాలా? వద్దా? అన్న ధర్మ సంకటంలో పడే కోటయ్య బద్ధకంతో ఐదు నిముషాలు పడుకొని లేద్దామనే నిర్ణయానికి వస్తే, అర్ధనిద్రలో వున్న ఒక శునకం, తలపైకెత్తకుండా, ఒక్కొక్క కన్నును కొద్దిగా తెరచి చూస్తున్నట్టు చూస్తాడు. తర్వాత తన నోరంతా తెరచి లోపలవున్న బొగ్గుపులుసు వాయువునంతా బయటకు పంపించి, ఫ్రీగా దొరికే ఆహారము ఎంత త్వరగా, ఎంత ఎక్కువగా స్వాహా చేస్తారో - ఆ విధంగా దొరికే

ప్రాణవాయువంతా లాగించేస్తాడు. తర్వాత ఆకాశాన్ని ఆహ్వానిస్తున్నట్లు తన రెండు చేతులు పెకెత్తి, బాణాసురుడిలాగా తన వెన్నెముకను వెనక్కు వంచుతాడు. ఈ రోజు అలాంటి అభ్యాసాలు ఏవీ అతను చేయలేదు. పరుగెత్తికెళ్లి పాపను తేరిపార చూసి, స్టేషన్ బయటకుపోయి, నాలుగు వైపుల ధృతగతిలో పరిసరాలను పరీక్ష చేశాడు. ఆ పసిపాప తల్లి అందనంత దూరానికి పారిపోయి వుంటుందనే అభిప్రాయానికి వచ్చిన కోటయ్య, గార్డ్‌పార్టీ అనే కుంభకర్ణ కమిటీ సభ్యుల్ని లేపి వివరాలు తెలుపుదామని అనుకొనే లోపల పాప ఏడ్పువిని వాళ్లు కూడా వులిక్కిపడి లేచారు.

ఉదయం పదిగంటల తర్వాత స్టేషన్‌కు వచ్చి, ఏడు గంటలకు 'జనరల్ డైరీ' ప్రారంభిస్తున్నాను అని వ్రాయబోతున్న ఎస్.ఐ.రామారావుకు, ఆ శిశు కాండము గురించి ఒక లఘు వివరణ లభించింది. ఆ పాపను చూడగా, అతనికి సహతాపం కంటే ఎక్కువగా, మమత అనే ఒక భావం పొంగుకొచ్చింది. అయినా కూడా, మొత్త పోలీసు స్టేషన్‌ను సుఖ సుషుప్తిలో ముంచుతున్న ఆ నైట్ డ్యూటీ వాళ్లను సంచి సంస్కృతంలో తిట్టకుండా వుండలేక పోయాడు. - - - ''గాడిద కొడుకుల్లారా! ఈ పిల్ల తల్లి, దీన్ని ఇక్కడ వదిలేసి పోయాక కూడా మీరెవరూ తెలుసుకోలేదు. ఎవరైనా వచ్చి బాంబు పెట్టి ఈ మొత్తం బిల్డింగ్‌ను బ్లాస్ట్ చేస్తే, మీరంతా ముక్కలు ముక్కలై చచ్చిపోతారు గాని, మీరెలా చచ్చారో మీకే తెలియకుండా పోతుంది. ఈ పాప తల్లి ఒక వేళ రాలేదనుకో, ఎవరో నక్సలైట్ వచ్చాడనుకో- అతను ఈ స్టేషన్లో వున్న తుపాకులన్నీ తీసుకు వెళ్లినా మీరు ఆ విషయమే తెలుసుకో లేరు. అతను మిమ్మల్ని కాల్చి చంపితే, ఆ కాల్పుల శబ్దం మీకు వినిపిస్తుందేమో! కాని, మీరంతా ఎలా చచ్చి పోయారో చెప్పడానికి ఒక్కడైనా మిగులుతాడా! పుడితే మనుషుల పిల్లల్లాగ పుట్టాలి అంతేగాని గాడిదల వారసుల్లా పుడితే, దీనికంటే మంచిగా ప్రవర్తించడం మీ వల్ల కాదు. మిమ్మల్నంతా డిస్మిస్ చేయడమే మంచిది. ఒరే కోటయ్యా! ఆ టైములో నువ్వే కదా సెంట్రీ. నిన్ను ఈ నిముషంలో సస్పెండ్ చెయ్యాలి. నీ వెధవ నిద్ర - - ఈ మొత్తం స్టేషన్ బిల్డింగ్‌నే ఎత్తుకుని పోయినా మీ రెవరూ పట్టించుకోరు - - దొంగనా కొడుకుల్లారా! ఈ పాప తల్లి గురించిన వివరాలు ఏమన్నా తెలిసాయా! దీన్ని తిరిగి ఆ తల్లికి అప్పజెప్పితేనే మనకు మనశ్శాంతి కలుగుతుంది. అంతవరకు, మీరే దీనికి తల్లిగా గాని, దీనబ్బ పెళ్లాంగా గాని వ్యవహరించాలి. ఈ స్టేషన్లోపల ఎప్పుడైనా దీని 'ఏడుపు వింటే మిమ్మల్నంతా ఇంటికి పంపిస్తాను.''

ఎస్.ఐ. గారు ఆ సమయంలో ఎంత వేడిగా వున్నా, ఆ వేడిని అలాగే నిల్పటానికి, ఆయన గుండెలోపల థర్మాస్‌ఫ్లాస్క్ లేదని, అందుకే, ఆ వేడి త్వరగా చల్లారి పోతుందని వాళ్లందరికీ తెలుసు. ఎస్.ఐ. రావడానికి ముందే, గార్డ్ పార్టీలో ఒకడు ఆ పాప కొరకు పాలు, పాలపీక అన్నీ తీసుకు రావడం వల్ల, ఆ పాప ఏడుపుకు తాత్కాలిక ఉపశమనం కలిగింది. కాని పోలిస్ స్టేషన్లో ఏడ్వకూడదని ఆ పసి బిడ్డకు

తెలుసా! అప్పుడప్పుడు - ఏడుస్తుంది. ఎవరైనా ఒక కానిస్టేబుల్, ఆ రోదనాగ్ని శమనానికి, ఏదో ఒక పద్ధతి అవలంభిస్తాడు. అవేనీ ఫలించకుండా పోతే పాపను తీసుకుని అతను పోలీస్టేషన్ వెనక పెరట్లో, కవాతు చేస్తున్నట్టు మెల్లగా అటు ఇటు నడుస్తాడు.

సబ్ ఇన్‌స్పెక్టర్ రామారావు తనకు అనుమానంగా వున్న హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబిల్స్‌ని, ఒకరితర్వాత ఒకర్ని తన గదికి పిల్చి ఇంటరాగేషన్ చేయడం మొదలుపెట్టాడు. అతనికి న్యాయంగా కలిగిన అనుమానం ఏమిటంటే, తన సిబ్బందిలో ఎవరికో, కొంతకాలంగా, ఏదైనా ఒక వాసవదత్తతోగాని, దత్తవాసవతో గాని, మధురవాణితోగాని, మదిరావాణితో గాని, వ్యభిచారిణితోగాని రహస్య బంధం ఏర్పడిందేమోనని. అలాంటి ఆడవాళ్లతో సంబంధం పెట్టుకోడానికి, ఎవరెస్టు పర్వతం ఎక్కడానికి చేసే ప్రయత్నాలు ఏమీ చేయనక్కరలేదు కదా! కాని, అలాంటి ఆడవాళ్లకయితే, పాప భారం పదినెలల దాకా మోసి, ప్రసవవేదన పడాల్సిన అవసరం లేదు. అలాంటి మదాలసలు చాలా ఆలశ్యంగా రెండవ నెలలో గాని, మూడవ నెలలోగాని ఆ పేలవ పిండాన్ని తీయించుకుంటారు. విషయాలు అలా వుండగా ఎవరి ద్వారా ఈ అన్యాయం జరిగిపోయి వుంటుంది? ఎక్కువగా అనుమానించ వలసింది పెళ్లికాని కానిస్టేబుల్స్ గురించే. ఈ పోలీస్‌స్టేషన్లో, ఒక నవజాత శిశువును వదిలిపెట్టి, ఒక స్త్రీ వెళ్లిపోయిందంటే, ఆమె మెడలో మాంగల్యం వుండకపోవచ్చు అనే అనుకోవాలి. తన పోలీసుస్టేషన్లో, ఎవరో ఒక బ్రహ్మచారి వెధవ, తాళి కడతానని ప్రలోభపెట్టి ఆ అబలను తన వలలో వేసుకొని వుంటాడు. ఆ విధంగా జన్మించిన ఆరవ ప్రాణాన్ని తన కలికాల దుష్యంతుడి కష్టడీలో వదిలేసి ఎక్కడికో వెళ్లి ఆమె ఉరివేసుకొని చచ్చిపోయి ఉంటుందేమో అనే ఆలోచన వచ్చేసరికి, రామారావు గుండెలో ఒక పెద్ద బండరాయి పడినట్లయింది. వయసులో వున్న, ఇద్దరు ముగ్గురు కానిస్టేబిల్స్‌ని, ఒకరి తర్వాత ఒకర్ని తన రూముకు పిలిచి కఠినంగా క్రాస్ ఎక్జామినేషన్ చేయడం జరిగింది. నిజం చెబుతావా లేదా అని నిలదీసి అడిగి, ఎన్ని బాధలుపెట్టినా, అబద్ధాలు మాత్రమే చెప్పే దొంగల తండ్రుల తండ్రుల లాంటి పోలీసు వాళ్లను చంపినా వాళ్లు నిజం చెబుతారా!! వాళ్లను ఒక రెండుమూడు రోజుల పాటు చాలా దగ్గరగా పరీక్షించాలని, వాళ్ల ప్రతి కదలికను ఒక మనశ్శాస్త్ర విశారదుడి నిపుణనేత్ర దక్షతతో వీక్షించాలని ఆ నియమ పాలకుడు నిర్ణయించుకున్నాడు.

ఆ చిన్నారిని మొట్టమొదట చూసినవాడు కోటయ్య. అప్పుడు మిగిలినవాళ్లు బాగా నిద్రలో వున్నారు. అయితే బహుశః ఆమే వచ్చి కోటయ్యతో ప్రత్యక్షంగా మాట్లాడి, ఆ బిడ్డని అతని చేతుల్లోనే పెట్టి వెళ్లిందేమో! పెళ్లై ఒక బిడ్డ తండ్రి అయిన కోటయ్యకు, ఒక బీద అమ్మాయిని మోసం చేయడానికి కావాల్సిన శారీరక బలం, గుండెబలం వున్నాయని రామారావుకు బాగా తెలుసు. పురాతన కాలంలో, ఒక మహారాజు ఆస్థానంలో, ఇద్దరు తల్లులు- ఒక బిడ్డ కొరకు పోట్లాడిన కథ అందరికి

తెలిసినదే. సరియైన తల్లి ఎవరని నిర్ణయించడం కష్టమైనపుడు, ఆ బిడ్డను సమానమైన రెండు ముక్కలుగా కోసి యిస్తానని రాజుగారు చెప్పేటప్పుడు, ఒక తల్లి దాన్ని అంగీకరించింది. రెండవ ఆమె, ఏడుస్తూ ''అలా వద్దు మహారాజా! నా బిడ్డ ఎక్కడున్నా సుఖంగా బతకాలని, నా కోరిక. ఈ బిడ్డను ఆమెకే ఇచ్చేయండి'' అని చెప్పడం జరిగింది. తన మెదడనే కంప్యూటర్‌లో వున్న డేటా బ్యాంకు నుంచి కథను వెలికితీసిన రామారావు, ఈ పాపను ఇంక ఏంచేయాలి అని ప్రశ్నించి, దానిపై కోటయ్య ముఖభావాలు ఎలా మారతాయోయని ఉత్సుకతతో చూస్తూ కూర్చున్నాడు. కొయ్య బారిన ముఖం పెట్టుకొని ''సార్, దీన్ని పిల్లలు లేని ఎవరికైనా పెంచుకునేందుకు ఇచ్చేయండి, లేదా ఏదైనా అనాథాశ్రమంలో చేర్పించండి.'' అని కోటయ్య సలహా ఇచ్చాడు. ''ఈ పాప తల్లి ఇక్కడ ఈ పాపను వదిలేసి పోయింది గాని, తండ్రి అనే మనిషి ఎవడైనా ఒకడుండాలి! అతనికి మనస్సాక్షి అనేది లేదా?'' అని ఆ నేరపరిశోధనా ప్రాజ్ఞుడు మళ్లీ అడిగాడు. ''సార్, దీనికి అబ్బ అనేవాడు వుంటేకదా, అతని మనస్సాక్షి గురించి మేము వెతకాలి. గ్రంథకర్త ఎవరని తెలియకపోవడం వల్లనే కదా ఆమె ఈ 'కాలవ్రాతప్రతిని' ఇక్కడ వదిలేసి పోయింది?'' అని యాభైశాతం వెటకారపు నవ్వుతో కోటయ్య ఒక ప్రతి ప్రశ్న పారేశాడు. ''నువ్వు ఎవరితో మాట్లాడుతున్నావురా! కొంచెం మర్యాదగా మాట్లాడు గాడిద'' అని గర్జించి ''నీకు ఇపుడు ఒక అబ్బాయి గదా వుండేది. ఈ అమ్మాయి ఎంత అందంగా వుంది! ఈ పాపను నీ కూతురుగా పెంచుకోకూడదా'' అని ఎస్సైగారు అపాయం లేని ఉపాయంగా ఒక గాలం విసిరారు. నక్కకు ప్రతి రూపమయిన కోటయ్య ఆ గాలానికి దొరుకుతాడా! ''సార్, నా భార్యకు ఇపుడు ఆరో నెల. ఈసారి పుట్టేది అబ్బాయైనా, అమ్మాయైనా, నా భార్యకు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయిస్తాను. సార్, మీరు ఏమీ అనుకోకపోతే, ఈ చిన్నవాడు, ఒక చిన్న అభిప్రాయం చెబుతాడు. తమరికి కోపం రాదని, పూర్తి విశ్వాసం కలిగిస్తేనే, ఈ నోరు తెరుచుకుంటుంది'' అని మంద్రస్థాయిలో మంత్రించి అతను నోరుమూసు కొని నిలబడ్డాడు. ''ఏమైనా, నీవు చెప్పాల్సింది చెప్పుకో- అది విన్న తర్వాత నేను ఏంచేయాలో నిర్ణయిస్తాను'' అని రామారావు అతనికొక శేరున్నర మాట ఇచ్చాడు.

''సారూ, తమరి పెళ్లై ఇప్పటికి పదిహేను సంవత్సరాలయింది. ఇంట్లోకి ఒక చిన్నారి అతిథి వచ్చే భాగ్యం మీకు ఇంతవరకు కలుగలేదు. చాలా మంది డాక్టర్లను తమరు సంప్రదించి వుంటారు. ఎన్నెన్నో గుళ్లల్లో తమరు మొక్కులు చెల్లించి వుంటారు. ఒక బిడ్డను దత్తత తీసుకోవడానికి తమరు సిద్ధంగా లేరు. తమరికి పర్వాలేదు. తమరెప్పుడూ బిజీనే కదా, పగలంతా బయట తిరుగుతారు. కాని, ఇరవైనాలుగు గంటలపాటు ఇంట్లో గడుపుతున్న అమ్మగారికి ఎంత బాధ కలుగు తుందో తమరికి తెలుసు. పాపం అమ్మగారు దిగులుతో రగిలిపోతూ వుంటుంది. తమరి ఇంట్లో ఒక పసిబిడ్డ పారాడుతూ వుంటే అది స్వర్గంగా మారుతుంది. పిల్లల అల్లరి చేష్టలతో కేరింతల శబ్దాలతో నిండి వుండడం ఇంటికొక గొప్ప అదృష్టం.

వచ్చీరాని పసిపాల ముద్దుపలుకులు, వాళ్ల చిలిపి నవ్వులు, చిరు ఏడుపులు, వీటివల్ల మనకు కలిగే ఆనందము, ఏ టీవీ వల్లా వీసీఆర్ ల వల్లా లభించవు. ఈ పాప మొహంలో వుండే కళ, తమరొకసారి చూడండి. బంగారం వంటి రంగు. చిదిమి దీపం పెట్టవచ్చు. ఎవరి బిడ్డ అయినాసరే, ఆ తలిదండ్రులలో కనీసం ఎవరో ఒకరు చాలా అందంగా వుండితీరాలి. తమరి చిరకాల ప్రార్థనలను ఆలకించి, ఏ కిన్నెర కన్యనో, గంధర్వ తరుణినో ఒక పాపను కని, తమరికందివ్వమని ఆ దేవుడు చెప్పివుంటాడు. పాప మొహం చూస్తే, దేవలోకం నుంచి జారిపడిన, ఒక దైవ ప్రసాదం లాగ వుంది. రెండుమూడు రోజులు ఈ పాపను ఇక్కడే వుంచి, తీసుక వెళ్ళేందుకు ఎవరూ రాకపోతే, తమరే ఇంటికి తీసుకువెళ్ళండి. పాపను పెంచుకోవడానికి అమ్మగారిని ఎలాగైనా ఒప్పించండి. పదిరోజులు పోయింతర్వాత, ఈ పాపను వదిలి అమ్మగారు ఒక్క క్షణం కూడా ఉండలేరు. తమరు ఈ బిడ్డకు తండ్రిగా వుండి తీరాలని నా నమ్మకం'' అని తనకు దొరికిన ఛాన్స్‌ని ఏమాత్రం పోగొట్టుకోకుండా కోటయ్య, తన మాట నైపుణ్యాన్ని బ్రహ్మాండంగా ప్రదర్శించడానికి ప్రయత్నించాడు.

''చాలు చాలురా బ్లడీఫూల్. నాకింక ఎక్కువ కోపం రాకముందే నువ్వు బయటకు వెళ్లిపో'' అని అరుస్తున్న రామారావు కోపరహిత కోపం చూసి, ఒక సెల్యూట్ పారేసి వస్తున్న నవ్వుని పెదాల మధ్య ఆపుకుంటూ కోటయ్య బయటకు వెళ్ళాడు.

ఆ సమయంలో పాన్‌పసంద్ అని ఏదో కంపెనీ వాళ్ళ ''షాది-ఔర్-తుంసే'' అనే టెలివిజన్ అడ్వర్టైజ్‌మెంట్ కోటయ్య మనసులో తళుక్కున మెరిసింది.

దీర్ఘాలోచన అనే స్విమ్మింగ్‌పూల్‌లో రామారావు కంఠంవరకూ మునిగిపోయాడు. కోటయ్య చెప్పేదంతా వాస్తవమే కదా! వసుంధర నిరంతరం దుఃఖానలంలో వేగిపోతూ ఉంటుంది తప్ప, ఆమె మనసు ఉన్న విషయాన్ని బయటకు చెప్పదు. వివాహానికి ముందూ, ఆ తర్వాత నాలుగైదు సంవత్సరాల వరకూ ఆమె ఎంతో ఉత్సాహంగా ఉండేది. ఆ రోజుల్లో చిలిపి చేష్టలతో అందర్నీ ఆకట్టుకొనే చిన్ననాటి వసుంధరను దూరంగా ఉంచటం తనకు సాధ్యం కాలేదు. తమ మధ్యలో ఏర్పడ్డ అనుబంధం ప్రేమగా రూపుదిద్దుకోవటానికి తన ఇష్టమొక్కటే కాక, ఆమె అర్ధాంగీకారమూ ఎంతగానో తోడ్పడింది. తమ ప్రేమకథలో ఏ విలనూ ప్రవేశించలేదు. తను రెండు పోలీస్ స్టేషన్లలో సబ్ ఇన్స్‌పెక్టర్‌గా ఉద్యోగానుభవం గడించేనాటికి ఆమె బి.ఎ. ప్యాసై ఒక సంవత్సరం గడిచింది. మూడో పోలీస్‌స్టేషన్‌లో చార్జ్ తీసికొని మూడోనెల గడిచేసరికి జీవితపర్యంత కారాగార శిక్ష లభించింది. అరెరె... సర్దాకైనా ఇట్లా చెప్పటం సమంజసం కాదు. తనైతే స్వేచ్ఛగా సంచరించవచ్చు; పాపం వసుంధరే గదా ఇంటి నాలుగుగోడల మధ్య ఉండిపోవాల్సి వచ్చింది. వివాహమైన ఒకనెలలోనే తమ మధ్య ప్రథమ కీచులాట జరిగింది... ఎంత సిల్లీగా ఉంది ఆ ప్రణయ కలహం! వసుంధరకు ఇద్దరు కుమారులు, మరో ఇద్దరు కూతుళ్ళు కావాలిట! ఒక సబ్ ఇన్స్‌పెక్టర్‌కు ఇద్దరికి

మించి పిల్లలు ఉండకూడదు... ఎక్కువమంది పిల్లలు ఉంటే లంచం తీసికోవటం తప్పనిసరి అవుతుందన్నది తన వాదన; ఇట్లా తమ మధ్య వాదోపవాదాలు పెచ్చుపెరిగి ఒక రోజు పర్యంతం వసుంధర తనతో మాట్లాడకుండా మౌనంగా ఉండేది. ఆ మౌనానికి, కన్నీటికి ఏదో అవినాభావ సంబంధం ఉన్నట్లు, ఆమె కన్నులు వర్షిస్తూనే ఉండేవి. ఆ మర్నాడు తను పోలీస్‌స్టేషన్ నుండి ఇంటికి వచ్చేసరికి, కన్నీటికి బదులు చిరుదరహాంతో వసుంధర స్వాగతం పలికేది. ''మన మధ్య జరిగే కొట్లాటలు పరిష్కరించటానికి నేనొక ఫార్ములా కనిపెట్టాను. మనకు ఒక అబ్బాయి, అమ్మాయి చాలు; ఇందుకు కనీసం నాలుగైదు సంవత్సరాలు సమయం తీసికొంటుంది గదా! తర్వాత ఇంకా ఇద్దరు పిల్లలు కావాలా వద్దా అన్న విషయాన్ని పరిశీలిద్దాం. సంవత్సరాల తర్వాత జరగవలసిన కొట్లాట ఇప్పుడెందుకు మన మధ్య?'' అని వసుంధర నవ్వుతూ చెప్పేసరికి గతరోజు తమ మధ్య జరిగిన కీచులాట ఎంతో అర్థరహితమైనదిగా అన్పించింది. వివాహమైన మూడు సంవత్సరాలు గడిచిపోయినా ఆమె సంతానవతి కాకపోవటంతో దైవ మొక్కులతో పాటు, ఒక గైనకాలజిస్టును గూడా సంప్రతించటం జరిగింది. కొన్ని పరీక్షలు చేసిన అనంతరం, గుండెను ముక్కలు చేసే ఒక కఠోర సత్యాన్ని తనతో చెప్పింది. వసుంధర ముందు ఆ విషయాన్ని ప్రస్తావించనందుకు ఆ డాక్టరుకే గాక, ముక్కోటి దేవతలకు కూడా నమస్కారాలు పెట్టాను. ఒకవేళ వసుంధరే గనుక ఆ వార్తను విని ఉంటే ఆమెకెలాటి ప్రమాదం జరిగి ఉండేదో!? వసుంధర కడుపులోని గర్భసంచి బాగా శుష్కించిపోయి ఉన్నదనీ, అందులో ఏ జీవీ ప్రాణం పోసుకొనే అవకాశమే లేదనీ ఆ డాక్టర్ అభిప్రాయం. ఈ రహస్యాన్ని వసుంధరకు తెలియకుండా దాచి ఉంచాను. పెండ్లికి ముందు, పెండ్లి అయిన అయిదు సంవత్సరాల వరకూ ఆమెకు పిల్లలంటే వల్లమాలిన అపేక్ష ఉండేది. ఏ పసిపిల్లను చూసినా దగ్గరకు తీసికొని ముద్దాడటం, హృదయానికి హత్తుకోవటం ఆమెకు సరదాగా ఉండేది; ఇటువంటి సందర్భాల్లో ఆమె సంతోషానికి అవధులుండేవి కావు. అయితే గత పది సంవత్సరాలలో పిల్లల పట్ల ఆమెకుండే వాత్సల్యానురాగాలు క్రమంగా తగ్గుతూ వచ్చాయి. ప్రస్తుతం ఆమె పిల్లల వైపు చూడటం కూడా మానివేసింది. పిల్లలున్న స్త్రీలను చూస్తేనే ఆమెకు అసూయగా ఉండేది. ఎవరైనా స్త్రీలు చుట్టాలైనా, స్నేహితురాండ్రైనా సరే వచ్చి తమ పిల్లల గూర్చి ముచ్చటిస్తే ఆమె ముఖం వివర్ణమై పోయేది... ఆ సంభాషణను ప్రక్కదారి పట్టించటానికి ప్రయత్నించేది... ఏదో కారణం చెప్పి వంటగదివైపు వెళ్ళిపోయేది. కాని ఏకాంతంగా ఉన్న సమయాల్లో ఏదైనా అందమైన పసిపిల్ల చిత్రం కనిపిస్తే మాత్రం రెప్పవేయకుండా ఆ బొమ్మను అట్లాగే చూస్తూ ఉండిపోయేది. అయిదు సంవత్సరాల క్రితం ఎవరినైనా ఒక పిల్లను దత్తుకు తీసికుందామని సూచించినప్పుడు ఆమె ముఖం కందగడ్డలా మారిపోయింది. ''వేరేవాళ్ళు అనుకొంటున్నట్లు నేనొక గొడ్రాలునని మీరూ విశ్వసిస్తున్నారా? పరాయివాళ్ళ పిల్లల్ని పెంచటానికి నేను సిద్ధంగా లేను. ఎప్పుడైనా

భగవంతుడు సంతానాన్ని అనుగ్రహిస్తే ఆ పిల్లలు చాలు మనకు. నా వయసు ఇప్పుడు ముప్పయి ఆరే గదా! పిల్లలు పుట్టే అవకాశం ఇంకా ఉంది గదా! కాదూ ఇహ నాకు పిల్లలు పుట్టే యోగమే లేకపోతే అదే దైవనిర్ణయంగా తీసుకొందాం. ఏదిఏమైనా ఎక్కడ నుండో తెచ్చుకొన్న పిల్లలను మురిపెంగా చూడటం నా వల్లకాదు'' అని వసుంధర తీవ్రస్వరంతో పల్కింది. స్త్రీల స్థిరమైన మనోనిశ్చయాలను గూర్చి, సమయానుకూలంగా మార్పుచెందే మనోభావాల గూర్చి తను గతంలోనే బాగా స్టడీచేయటం జరిగింది. యవ్వన సమయంలో దాదాపు ఆడపిల్లలందరూ కళ్యాణం గూర్చే కలలుగంటూ ఉంటారు. బాగా చదువుకొన్న అమ్మాయి అయినా, పెద్ద ఉద్యోగం చేయాలని భావించే అమ్మాయి అయినా, ముందుగా తపించేది భార్యగా ఉండాలనే. కానీ ఏ ఒక్క స్త్రీ గమ్యస్థానమైనా అది కాదు. వివాహం ఆమె చేరే గమ్యస్థానానికి ముందున్న ఒక మైలురాయి వంటిది మాత్రమే. తర్వాత వస్తున్న మైలురాయి మాతృత్వం. తగు సమయంలో వివాహం కాని కొందరు ఆడపిల్లలకు హిస్టీరియా అనే ఒక మనోరోగం సంభవించే అవకాశముంది. వివాహానంతరం పిల్లలకు నోచుకోని కొందరు ఆడవాళ్ళకు ప్రపంచం మీదనే ద్వేషం పెరిగిపోతుంది. వాళ్ళ మనసుకు ఎప్పుడూ ఉల్లాసం ఉండదు. అందరితో ఏదో పగ ఉన్నట్లుగా వాళ్ళు వ్యవహరిస్తారు. బ్రతుకుపై విసుగు చెందినట్లుగా వాళ్ళు కన్పిస్తారు. సంతానం కలుగకపోవటానికి భర్తలో లైంగికపరంగా ఏ లోపం లేకపోయినప్పటికీ అతనిపై అయిష్టత పెంచుకొంటారు కొందరు స్త్రీలు. భర్త పరస్త్రీలను చేరదీస్తున్నాడన్న అనుమానం గూడా పెంచుకొంటారు వాళ్ళు. భర్త ఎంత ఎక్కువ ప్రేమానురాగాలు చూపెట్టినా అదంతా వట్టి నటనేనని, ఆంతర్యంలో తమను ద్వేషిస్తున్నాడనీ, తనను వివాహమాడినందుకు స్వయంకృత అపరాధంగా తలపోస్తున్నాడనీ భావించి వ్యథ చెందుతారు కొందరు స్త్రీలు... దేవతల్ని సైతం వాళ్ళు శపిస్తూ ఉంటారు... స్త్రీ జన్మకు మాతృత్వమేనా ఏకైక లక్ష్యం? పుష్పించటం, ఫలాలనివ్వటం తప్ప ఒక వృక్షానికి వేరే సాఫల్యమేముంటుంది? మగ పుష్పాలనే పూసే కొన్ని వృక్షాలను నరికివేయటం సహజం. ఒక ఆవు ఈనలేదని రూఢి అయితే దానిని కసాయివానికివ్వటమూ సహజమే. గర్భం దాల్చలేని స్త్రీలని భర్తగాని, అతని బంధువులుగాని నరకటమైతే చేయరు గాని, నరకయాతనలు పెట్టటం జరుగుతూనే ఉంది. భర్తలో లైంగిక లోపం ఉన్నా, దానిని భార్యకే ఆపాదించి ఆమెను హింసించటమూ చూస్తూనే ఉన్నాం. సాధారణంగా స్త్రీల దృష్టిలోనే, ప్రసవానికి నోచుకొని స్త్రీ జీవితం నిరర్థకంగా నిరాశాపూరితంగా అసంపూర్ణంగా ఉంటుంది. సంతానవతులు కాలేని స్త్రీకి పరిణయం నుండీ మరణం వరకూ పరితాపమే మిగిలి ఉంటుంది. ఆమె భవిష్యత్తు మాధుర్య రహితం. ఆశారహితం; స్వప్నరహితం. ఇటువంటి స్త్రీలు గూడా తమ జీవితాలను సార్థకం, ఆశాభరితం చేసుకోవటానికి ప్రయత్నం చేయాలి గదా! కళ్ళులేనివారు బ్రతకటం లేదా? కాళ్ళు లేని వాళ్ళు జీవించటం లేదా? చెవిటి, మూగవాళ్ళ కళ్ళల్లో సంతృప్తి తాలూకు

వెలుగు కన్పించటం లేదా? కుష్ఠురోగం వల్ల వ్రేళ్ళు కొరుక్కుపోయిన వాళ్ళు సైతం సర్వం మర్చి హాయిగా నవ్వుకోవటం లేదా? పాటలు పాడటం లేదా?

వసుంధరకు ఇతరుల నుండి ఎటువంటి వత్తిళ్ళు, బాధలూ లేవు. తనైతే ఆమెను బంగారంతో సమంగా చూసుకొంటున్నాడు. ఆమె తనకు పంచప్రాణాలు... ఆమెకు ఎలాంటి మనోవ్యధ కలుగకుండా చేయవలసిదంతా తాను చేస్తూనే ఉన్నాడు. ఏనాటికీ తల్లికాలేదన్న దారుణ సత్యాన్ని ఆమెకు తెలియనీయకుండా తాను జాగ్రత్తపడ్డాడు. అన్నివిధాలా ఆమెను సంతోషపెట్టటానికే తాను ప్రయత్నిస్తున్నాడు. అయినా ఆమెలో నిరుత్సాహం, విసుగు, పెరుగుతూనే వస్తున్నాయి; తనతో గూడా ఆమె సాన్నిహిత్యంగా మెలగటం లేదు. పాపం, వేదనతో రగిలిపోతున్నందువల్లనే గదా ఆమె అంత అసంతృప్తిగా గడుపుతున్నది?

* * *

మూడు రోజులు ఎదురుచూసినా ఆ పాపను తీసికొనిపోవటానికి ఎవరూ స్టేషన్‌కు రాలేదు. స్టేషన్లో ఉండే అందరి వాత్సల్యాన్నీ ఆ సువర్ణసుందరి చూరగొనగలిగింది.

నాలుగవనాడు ఉదయమే స్టేషన్‌కు వచ్చిన రామారావు పాపను తీసుకొని ఇంటికివెళ్ళాడు. ఈ మూడు రోజుల నుండే పాపను గూర్చిన విషయాలన్నీ వసుంధరకు రామారావు చెబుతూ ఉన్నా ఆమె నుండి ఎటువంటి ప్రతిస్పందనా రాలేదు.

భర్త చేతిలో ఉన్న పాపను సరిగ్గా చూడకుండానే ''దీన్ని ఇక్కడకెందుకు తీసుకువచ్చారు?'' అంటూ విసుగుతో ప్రశ్నించింది వసుంధర.

''దొంగలు, రౌడీలు, తిరిగే పోలీస్‌స్టేషన్లో ఈ దివ్యపాపను ఎంతకాలం ఉంచాలి? ఒక తల్లిలాగా ఈ పాపను చూడటానికి అక్కడెవరూ లేరే?'' ఆ పాప ముద్దులొలికే ముఖాన్ని తదేకంగా చూస్తూ అన్నాడు రామారావు.

''తల్లిలాగా దీన్ని చూడటానికి ఇక్కడ మాత్రం ఎవరున్నారు? పరాయి వాళ్ళ పిల్లల్ని సాకటం నా వల్లకాదు.''

''వసూ... ఈ పాప పాలుగారే ముఖాన్ని ఒక్కసారి చూడు. చిరునవ్వుతో ఎంత అందంగా ఉందో. ఈమె నీకు ఎలాంటి ఇబ్బందీ కలిగించదు. ప్రస్తుతం ఈ పాప విషయమంతా విలాసిని చూసుకొంటుంది.''

''ఆ విలాసినికిక్కడ ఇదే పనా? అయినా ఆమె సాయంత్రం ఇంటికెళ్ళిపోతుంది; రాత్రి సమయాల్లో దాన్నెవరు చూస్తారు?''

''కొన్నిరోజులపాటు రాత్రిళ్ళు కూడా విలాసిని ఇక్కడే ఉండిపోతుంది.''

''అట్లా ఎంతకాలం జరగాలని మీ ఉద్దేశం?''

''కొద్దిరోజుల్లోనే ఈ పాప తల్లి తప్పకుండా తిరిగి వస్తుంది. ఎటువంటి స్త్రీ అయినా పువ్వులాంటి ఇటువంటి పాపను వదిలి సంతోషంగా జీవించగలదా?''

''ఇటువంటి వాళ్ళను స్త్రీ అని పిలవటమే తప్పు. కళ్ళెం లేని గుఱ్ఱాల్లాగా, అదుపూ, ఆజ్ఞ లేని ఆడవాళ్ళకు సిగ్గూ ఎగ్గూ ఏమైనా ఉంటాయా? ఈ రెండూ లేనివాళ్ళకు మనస్సాక్షి అనేదే ఉండదు. వాళ్ళు గర్భం ధరించటం చాలా సుళువు. ప్రసవించిన బిడ్డను చెత్తకుండీలో పారేసి పోవటానికి ఎటువంటి బాధా ఉండదు వాళ్ళకు. రత్నం అని చెప్పి ఏదో గులకరాయిని తీసికొస్తే మళ్ళీ ఏదోనాటికి అది ఆ చెత్తకుండీకే చేరిపోతుంది.''

- ''ఇంత క్రూరంగా మాట్లాడకు వసూ... నాలుగైదు రోజులు ప్రాయంగల ఈ పసిగుడ్డుకు ఏం తెలుసు? ఈ చిన్నారిపాప భవిష్యత్తును భద్రపరిచే బాధ్యత దీనిని పెంచే వాళ్ళపైనే ఉంటుంది.''

''కాని ఆ బాధ్యతను నెత్తిన వేసుకోవటానికి నేను సిద్ధంగా లేను. దీన్ని పెంచి పెద్దచేయాలన్న ఉద్దేశమేదైనా మీకు ఉంటే అది ఈ ఇంట్లో కుదరదు. వేరే ఏ ఇంట్లోనైనా ఈ పని మీరు చేస్తే నాకెలాంటి అభ్యంతరం లేదు. ఈ ఇంట్లో ఒకపాప పెరగాలంటే అది మన బిడ్డే అయితీరాలి... ఎంగిలి కూడు తినే ఖర్మ నాకు లేదు.''

''ప్రస్తుతం కొన్నిరోజులు ఈ పాప ఇక్కడే ఉండాలి. నీకే ఇబ్బందీ కలగదు. ఈ బిడ్డకు కావాల్సినదంతా విలాసిని చూసుకొంటుంది.''

తన్నుకొచ్చిన కోపాన్ని లోపలే నిగ్రహించుకొన్నాడు రామారావు. ఈ లోపల పనిమనిషి విలాసిని వచ్చి రామారావు చేతిలోని పాపను తీసికొని గుండెకు హత్తుకొంది.

విలాసిని తన కొత్త బాధ్యతను చాలా సమర్థవంతంగా నిర్వహించింది. నిస్వార్థ ప్రేమతో ఎప్పుడు రామారావు ఇంటికివచ్చినా ఆ పాపతో ఆడుకోవటం సాధారణ మైంది. రోజురోజుకు రామారావులో ఆ పాప పట్ల వాత్సల్యం అధికం కాసాగింది. అది గమనిస్తున్న వసుంధరలో అసహ్యత పెరగసాగింది. పాప పట్ల వసుంధర వైఖరిలో మార్పేమైనా వచ్చిందా? పాపను ఎప్పుడైనా లాలించిందా? అంటూ రామారావు ప్రతిరోజూ విలాసినిని ప్రశ్నించేవాడు; ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పటానికి విలాసినికిష్టముండేది కాదు... పాపను అమ్మగారు ఏనాడూ పట్టించుకోలేదు; పాప బిగ్గరగా ఏడవటం జరిగితే ''దీనిని బయట విసిరి పారేయి'' అని అరవటమేగాక, నాపైనా గూడా ఆమెకు కోపం అధికమైనట్టుంది అని విలాసినికి చెప్పకతప్పింది కాదు.

ఆ విధంగా పదిహేను రాత్రింబవళ్లు గడిచిపోయినా వసుంధర వైఖరిలో ఏ మార్పు రాలేదు. వసుంధర పట్ల నిర్దయగా ఉండాలన్న ఆలోచన రామారావు మనసులోకి గూడా వచ్చేదికాదు; కానీ వసుంధర కాఠిన్య నడవడికచూసి అతని సంయమనం

గూడా కొద్దిగా సన్నగిల్లుతూ ఉంది. తన హృదయాన్ని గాయం చేసే సూటిపోటీ మాటలతో పాటు, పాప తల్లిగూర్చి వసుంధర పల్కే నిందాపూరిత వ్యాఖ్యలు రామారావు మనోనిగ్రహాన్ని సడలించసాగాయి. ఆమె పట్ల తనకున్న ప్రగాఢ ప్రేమ భావం సన్నగిల్లిపోలేదా అన్న అనుమానం రామారావులో కలిగింది.

ఆ రోజు ఆదివారం; ఉదయం స్టేషన్ కు వెళ్ళిన రామారావు పదకొండు గంటల సమయానికి ఇంటికొచ్చాడు. ఉయ్యాలలో ఉన్న ఆ పాపతో ఆడుకోసాగాడు రామారావు.

''మీ తిండీ తిప్పలూ సమస్తమూ ఈ పాపేనా ఇక? చివరకు స్టేషన్ లో పనిచూడటం గూడా మానేశారా?'' అని వసుంధర పరిహాస స్వరంతో పలికింది.

ఈ మాటలు విన్న రామారావు గుండె భగ్గుమంది. ''మానవత్వం ఉన్న ఏ మనిషికైనా ఈ పాపను చూస్తే మమకారం కలగకుండా ఉంటుందా?'' పెడముఖం పెట్టి అన్నాడు రామారావు.

''అవునవును... నాకు మానవత్వం లేదు; ప్రసవించలేని నాకు అవ్వన్నీ ఎలా వస్తాయి? నేనొక గొడ్రాలిని కదా....'' అంటున్న వసుంధర కళ్ళు వర్షించాయి ధారగా.

''వసూ... నీతో హృదయం విప్పి మాట్లాడాలని కొన్నిరోజుల్నుండీ అనుకొంటున్నాను. ఇంకా ఆలస్యమైతే వేరే ప్రయోజనమేదీ లేకపోగా మనిద్దరి మధ్య మరింత అసంతృప్తి పేరుకుపోతుంది. నీవు తట్టుకోలేవన్న భావంతో ఒక క్రూరమైన సత్యాన్ని నీకు తెలుపకుండా దాచి ఉంచాను పన్నెండు సంవత్సరాలుగా. అవసరానికి మించిన గుండె నిబ్బరాన్ని ప్రస్తుతం నీవు అలవర్చుకొన్నావు గాబట్టి ఇంకా నీనుండి రహస్యాన్ని దూరంగా ఉంచటం అనవసరమే కదా!''

ఒక్కసారిగా వసుంధర ముఖం పాలిపోయింది. ''అదేమిటో ముందు చెప్పండి'' భయవిహ్వల మనస్సుతో ఉత్కంఠతతో ఆమె అడిగింది.

''పన్నెండు సంవత్సరాల క్రితం 'అన్నమ్మ థామస్' అనే గైనకాలజిస్టు వద్దకు వెళ్ళి టెస్ట్ చేయించుకొన్న విషయం నీకు గుర్తుండే ఉంటుంది. అప్పుడు నీవు చాలా అమాయకురాలివి; డాక్టర్ తెల్పిన విషయాన్ని నేను అప్పుడే నీకు చెప్పి ఉన్నట్లయితే నీ గుండె బ్రద్దలయ్యేది''

''నన్ను చంపక ఆ విషయమేమిటో వెంటనే చెప్పొచ్చుగా'' హీన స్వరంతో పల్కింది వసుంధర.

''నీ గర్భసంచి చాలా ఉష్కించిపోయి ఉన్నదనీ, అందువల్ల మాతృస్థానం పొందే అవకాశమే నీకు లేదనీ ఆ టెస్ట్ లో తేలింది.

ఆ క్షణంలో వసుంధర నిరుత్తరరాలైంది; బుగ్గలు కంపిస్తుండగా విచ్చుకొన్న కళ్ళతో మ్రాన్పడి చూస్తుండి పోయింది. ఉగ్గబట్టిన ఏడుపు, దీర్ఘనిశ్వాసం కలగలసిన ఒక వింత శబ్దం ఆమె కంఠం నుండి వెలువడింది. ముందు నోటినీ, ఆ తర్వాత ముఖాన్నీ అరచేతులతో కప్పుకొని ఆమె విలపించింది. ఉవ్వెత్తున ఎగసిపడే ఆమె గుండె చప్పుళ్ళు రామారావుకు స్పష్టంగా విన్పించాయి. వసుంధర పరిస్థితి చూసిన రామారావు మనసు కలుక్కుమంది; ఆమెను దగ్గరకు తీసుకొని ఆలింగనం చేసుకున్నాడు; రామారావు కౌగిలిలో వదిగిపోయి గూడుకట్టిన వేదనలో మునిగిన వసుంధర అతని వీపును చేతివేళ్ళతో పిండసాగింది. వీపులో కలిగిన నొప్పిని భరిస్తూ, ఆమె హృదయ వేదన ఇంకా ఎంత తీవ్రస్థాయిలో ఉంటుందోనన్న ఆలోచనలో పడిపోయాడు రామారావు. ఆమె తలపై నిమురుతూ, వీపును అనురాగంతో తట్టుతూ ఊరడించాడు రామారావు– "ఊరుకో వసూ... ఊరుకో... దైవ నిర్ణయాన్ని ఎవరు మాత్రం మార్చగలరు? ఇంతకాలం ఈ రహస్యాన్ని ఒక అగ్నిపర్వతంలాగా నా గుండెల్లోనే దాచాను. మంచి భవిష్యత్తుపట్ల నీకున్న అనంత విశ్వాసాన్ని దెబ్బతీయటానికి నాకు మనస్కరించలేదు. ఇంతవయసు వచ్చి, ఇంత అనుభవం గడించిన మనం జీవితంలో ఎదురయ్యే అన్ని విఘాతాల్నీ ఎదుర్కొని నిలబడగలిగే ధైర్యాన్నిన్ని పెంపొందించుకోవాలి. మన జీవితం సగం గడిచిపోయింది. ఇంకా ఎంత మిగిలి ఉందో ఆ భగవంతుడికే తెలుసు. భావి జీవితాన్నైనా ఇక సంతోషంగా గడుపుదాం. తల్లిదండ్రులెవరైనా ఈ పాప పుత్తడిబొమ్మే గదా! కోరికలకు కళ్ళెం లేకుండా ఇష్టం వచ్చినట్లు స్వేచ్ఛగా ఈ పాప తల్లి తిరిగిందని ఆమెను నీవు నిందించటం జరిగింది. నీ దృష్టిలో ఆమె ప్రవర్తన అంత నీచమైనదీ, నిందార్హమైనదీ అయితే, కాళిదాసు మహాకవి శకుంతల నాయికగా అభిజ్ఞాన శాకుంతలం ఎందుకు వ్రాశాడు? ఆ శకుంతలకు పుట్టిన తండ్రి తెలియని భరతుడు అంత గొప్పవాడు ఎట్లా అయినాడు వసూ? కన్యకు పుట్టిన కర్ణుడు అంతటి మహావీరుడెట్లా అయినాడు? భర్త జీవించి ఉండగానే కుంతీ, మాద్రిలు పర పురుషులతో సంతానాన్ని పొందలేదా? ఆ అయిదుగురినీ ఒక పాంచాలి వరించి, భరించలేదా? ఈ స్త్రీలందరూ పురాతన భారతంలో పూజనీయులే గదా! ఈ పాప తల్లి ఎవరో మనకు తెలియకపోయినా ఆమెను కులటగా, నీచురాలుగా మనం పేర్కొంటున్నాం- స్వీయరక్షణకు ఆమెకొక అవకాశం గూడా ఈయకుండానే; నేనూ నీవూ ఎందరో దైవాలను ప్రార్థించాం; ఎన్నో గుళ్ళకు మొక్కుకున్నాం. మన దీర్ఘకాల ప్రార్థనల ఫలంగానే ఈ పాప మనకు లభించిందని నేను భావిస్తున్నాను. పిల్లలు లేరన్న వేదనతో పూజామందిరంలో నీవు దైవాన్ని ప్రార్థిస్తూ ఉన్నప్పుడు, నిర్మలమైన ఈ పాపే నీ ముందు ప్రత్యక్షమై ఉంటే వరప్రసాదంగా నీవు స్వీకరించి ఉండేదానివి కాదా? భగవంతుడు మనకేదైనా మేలు చేయదల్చుకొన్నప్పుడు అది ఫలానా తీరులోనే ఉండాలని నిర్ణయించుకోవటం తప్పు. చిన్ని కృష్ణుణ్ణి యశోద ప్రాణంతో సమానంగా పెంచి పెద్దచేయలేదా? కనీసం ఇప్పుడైనా నీవు కళ్ళుదెరువు. ఈ జీవితాన్ని

భగవంతుడు ఎట్లా ప్రసాదించాడో ఆ విధంగానే స్వీకరించు. దుఃఖించటానికి చాలా కారణాలే ఉండొచ్చు; అదేవిధంగా దుఃఖాన్ని దూరం చేసుకోవటానికి, సుఖాన్ని పొందటానికీ కూడా ఎన్నో మార్గాలుంటాయి. కావాలంటే నన్ను ఎదిరించు; కానీ దేవుణ్ణి ధిక్కరించకు. దైవకృపకు సజీవ ప్రతీకగా ఉన్న ఈ పాపను ముట్టుకోకూడదన్నదే నీ భావన అయితే అది మహాఘోరం.''

వెక్కివెక్కి ఏడుస్తున్న వసుంధర రామారావు పాదాలమీద పడింది. రెండు చేతులతో అతని కాళ్ళను చుట్టేసింది. అనురాగంతో పొర్లిపోయిన రామారావు కన్నులు సజలమైనాయి. వసుంధరను పైకిలేపి అక్కున చేర్చుకున్నాడు.

''నన్ను క్షమించండి. నా స్వార్థాన్ని మాత్రమే ఆలోచించి ఈ ప్రపంచాన్ని ద్వేషించాను; విస్మరించాను. ఇంతవరకూ ఎంతో అపసవ్యమైన రీతిలో నేను ప్రవర్తించాను. కళ్ళెం లేకుండా సంచరించిందని వేరే ఒక స్త్రీని న్యూనతా భావంతో చూసిన నాకు ఎదురయిందేమిటి? నా ఒక్క జీవితానికే కాదు, మనిద్దరి సుఖసంతోషాల మనుగడకు విరుద్ధంగా గూడా నేను కళ్ళెం వేశాను. మనిద్దరి జీవితంలో ఆనందం వెల్లివిరియటానికి భగవంతుడు పంపిన వరమే ఈ పాప. ఈ రోజు నుండీ ఈ పాప నా కూతురే- కాదు- మన కూతురు... ఎప్పుడు కూడా ఈ పాప మన నుంచి దూరం కాకుండా ఉండేట్లు భగవంతుడు చూస్తే చాలు'' అంటూనే ఆ పాపను చేతుల్లోకి తీసికొని ఆపాదమస్తకం ముద్దులతో నింపివేసింది వసుంధర. నవనీత సదృశమైన వసుంధర రొమ్ముమీదికి చేరగానే ఆ పాపలో తల్లిగూర్చిన అన్వేషణ ఆరంభమైంది. ఈ పరిణామంలో తల్లిగాని తల్లి వసుంధర తనువంతా ఫలకించి పోయింది. పట్టరాని ఆనందంతో అయిదడుగుల పదకొండు అంగుళాల రామారావు శరీరం రోమాంచ కంచుకితమైంది. తన ద్వాదశ వత్సరాల తపస్సుకు లభించిన సువర్ణఫలం రామారావుకు పరమానందం కల్గించింది. ఎన్నో సంవత్సరాల ప్రయాస అనంతరం సజీవంగా వీరప్పను నిర్బంధించగలిగిన ఒక దక్షిణ భారత రక్షకభటుని ఆహ్లాదం వలె ఉంది ఈ పరమానందం.

* * *

ఇహ ఇప్పుడు ఆ పాప తల్లి ఎవరు అనే విషయాన్ని ఒక నిగూఢ రహస్యంగానే ఉండనీయండి. కాని, ఆ పాప జనకుడు... కోటయ్యా?... లేక సాక్షాత్తూ మన రామారావేనా? అన్న తీరని సందేహాలు పాఠకుని మనసును తొలుస్తు ఉండవచ్చు. ఇటువంటి బాధామయానుభవం ఎవరికైనా ఎక్కువ కాలం ఉంటే ఆ పాఠకప్రియుడు, కావాలనుకొంటే ఈ కథారచయితను సందర్శించి సందేహనివృత్తిచేసుకోవచ్చు; సంకోచించపనిలేదు.

---